ఆయుర్వేద ఆసుపత్రులకు 'ఆయుష్'

- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వైద్యశాలల అభివృద్ధి
- రోగులకు ఉచితంగా మందులు, చికిత్సలు
- అనిగండ్లపాడు ఆయుష్ కేంద్రంలో పంచకర్మ సేవలు
- భారీగా పెరిగిన ఓపీ
- సుందరంగా ఆసుపత్రి పరిసరాలు



ఔషధ మొక్కల మధ్య అనిగండ్లపాడు ఆయుష్ వైద్యాలయం

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): కరోనా వంటి విపత్తుల తరువాత ఆయుష్ విభాగంలో ఆయుర్వేద వైద్యంపై ప్రజలకు మరింత చైతన్యం పెరిగింది. అప్పటివరకు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలుగా ఉన్నవాటిని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జాతీయ ఆయుష్ మిషన్ ద్వారా ఒక్కో వైద్యశాలకు రూ.7లక్షల నుంచి రూ.8 లక్షలు నిధులు కేటాయించి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్(ఆయిష్)గా అప్‌గ్రేడ్ చేసింది. పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడుతోపాటు కొణకంచి, వేదాద్రి, పెద్దవరం, గూడవల్లి ఆయుష్ కేంద్రాలు అప్‌గ్రేడ్ అయ్యాయి. విజయవాడ తరువాత అనిగండ్లపాడులో మాత్రమే ప్రజలకు పంచకర్మ సేవలు అందుబాటులోకి వచ్చాయి.

ఔషధ మొక్కలపై రోగులకు అవగాహన..

రోగులకు అవగాహన కల్పించేలా ఆయుష్ కేంద్రం ఆవరణలో పలు రకాల ఔషద మొక్కలు పెంచుతున్నారు. అశ్వగంధ, సరస్వతి, నల్లేరు, వేప, తులసి, తెల్లగన్నేరు, ఉసిరి, తమలపాకు, తిప్పతీగ, ఉమ్మెత్త వంటి మొక్కలు పెంచుతున్నారు. కీళ్ల వ్యాధులతో బాధపడే రోగులకు ఇన్‌ఫ్రా డైట్ అనే యంత్రంతో చికిత్సచేస్తూ క్రమేపీ వ్యాధి నివారణకు వైద్యులు కృషి చేస్తున్నారు. ఆయుర్వేద మందులను గోవా, ఉత్తరాఖండ్, కేరళ, కర్నాటక రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి రోగులకు ఉచితంగా అందిస్తున్నారు. ఇక్కడ రోగులకు అన్నిరకాల వ్యాధులకు సంబంధించి 100 నుంచి 110 రకాల మందులు అందుబాటులో ఉండటం గమనించాల్సి అంశం. రోజువారీ రోగుల వివరాలు, మందుల పంపిణీ వివరాలను ఎప్పటికప్పుడే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ప్రభుత్వం కూడా ఆయా వివరాలను ఆన్‌లైన్ ద్వారా పరిశీలించి అవసరమైన మందులను ఆయుష్ కేంద్రాలకు సరఫరా చేస్తోంది. దీంతో ఆయుష్ వైద్యశాలల ద్వారా సేవలు పొందుతున్న రోగులు ఎంతో సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

అందుబాటులోకి పంచకర్మ సేవలు...


మహిళకు పంచకర్మ వైద్యం చేస్తున్న థెరపిస్ట్

పంచకర్మ సేవలు అందించేందుకు ఇద్దరు పంచకర్మ థెరపిస్ట్‌లను కూడా నియమించారు. వీరు నడుం నొప్పి, మోకాలు నొప్పులు, కీళ్లవాతం, సయాటికా నొప్పులకు పంచకర్మ వైద్యం అందిస్తున్నారు. దీంతో ఆయుష్ వైద్యశాలకు వచ్చే రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. అలాగే స్త్రీలకు ఆరోగ్య మందిర్‌లో నెలకు 20 యోగా క్లాసులు ఇస్తుండగా, పాఠశాలల్లో,పురుషులకు 32 క్లాసులు శిక్షకుల ద్వారా ఇప్పిస్తున్నారు.

యాప్ ద్వారా వైద్య సమాచారం...



శరీర, మానసిక తత్వం ఆధారంగా ఏఆహారం తినాలి, ఏమి తినకూడదు అనే అంశాలతోపాటు ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రకృతి పరీక్ష అభియాన్ అనే యాప్ ద్వారా రోగుల ఫోన్‌కు సమాచారం పంపిస్తున్నాం. నవంబర్ 26న ప్రారంభమైన ఈ కార్యక్రమం డిసెంబర్ 24వరకు కొనసాగుతుంది. ఇప్పటి వరకు అనిగండ్లపాడు కేంద్రం ద్వారా 230మందికి ఈ యాప్ ద్వారా సమాచారం తెలియజేశాం. జన్యుపరమైన వ్యాధులకు రసాయన ఔషధాలు అందుబాటులో ఉన్నాయి. వృద్ధాప్యంలో మానసికంగా ధృడంగా ఉండటం, ధాతువులు శక్తివంతంగా ఉండటానికి ఆయుర్వేద ఔషదాలు ఎంతగానో ఉపయోగపడతాయి. – డా.వై.రత్నప్రియదర్శిని, వైద్యాధికారి

సేవలు బాగున్నాయి..



మాగ్రామంలో ఆయుర్వేద ఆసుపత్రిని బాగా అభివృద్ధి చేశారు. రోగుల్లో కూడా అవగాహన పెరిగింది. ఓపీకి కూడా రోజు 40నుంచి 50మంది వస్తున్నారు. అన్ని రోగాలకు ఉచితంగా మందులు అందించటంతోపాటు పంచకర్మ వైద్యం కూడా అందుబాటులోకి రావడం సంతోషంగా ఉంది. –నెల్లూరి గోపాలరావు, ఆలయ మాజీ చైర్మన్, అనిగండ్లపాడు

క్లుప్తంగా

క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం



జగ్గయ్యపేటఅర్బన్: క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతోపాటు ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవచ్చని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. ఇటీవల రామ్‌కో సిమెంట్స్ వారి సీతారామమ్మాశ్ మందిర్ స్కూల్‌లో నిర్వహించిన కరాటే బెల్ట్ గ్రేడింగ్‌లో 45మంది విద్యార్థులు పాల్గొనగా, 9మంది విద్యార్థులు ఎల్లో, ఆరెంజ్, బ్లూ బెల్టులను కైవసం చేసుకున్నారు. ఈసందర్భంగా పట్టణంలోని లిటిల్ ఏంజిల్స్ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన బెల్ట్ అవార్డింగ్ కార్యక్రమానికి ఎమ్మెల్యే తాతయ్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రతిభచూపిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో మేజర్ ఎస్‌వీవీ.సత్యనారాయణ, కరాటే చీఫ్ ఎగ్జామినర్ మిస్టర్ బెన్నీకుమార్, కరాటే కోచ్ ఎం.నాయక్, లిటిల్ ఏంజిల్స్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్యులు, పీడీ ప్రసాదరావు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు



నందిగామటౌన్: మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహనాలు సీజ్ చేయడంతోపాటు కేసులు నమోదు చేస్తామని సీఐ వైవిఎల్ నాయుడు హెచ్చరించారు. పట్టణంలోని గాంధీ సెంటరులో శుక్రవారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. పలువురు వాహనదారులచే పెండింగ్ చలానాలు కట్టించారు. ఈసందర్భంగా సీఐ నాయుడు మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు హెల్మెట్ లేకుండా వాహనాలు నడపరాదన్నారు. హెల్మెట్ వినియోగంతో కలిగే ప్రయోజనాలను గుర్తించి అందరూ హెల్మెట్‌ను వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ అభిమన్యు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కోట బుచ్చయ్య చౌదరికి ఘననివాళి


కోట బుచ్చయ్యచౌదరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

చందర్లపాడు(నందిగామటౌన్): వైఎస్సార్ సీపీ చందర్లపాడు మండల మాజీ కన్వీనర్ కోట బుచ్చయ్య చౌదరి మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్, నందిగామ మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. చందర్లపాడులో శుక్రవారం కోట బుచ్చయ్య చౌదరి మూడో వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయం, బుచ్చయ్య నివాసంలో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటాలకు వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా డాక్టర్ అరుణ కుమార్, డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ పార్టీ మండల కన్వీనర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బుచ్చయ్యచౌదరి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, వెలగపూడి వెంకటేశ్వరరావు, కోట సత్యనారాయణ, నెలకుదిటి శివనాగేశ్వరరావు, పారుపల్లి హరిబాబు, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, కందుల బుచ్చిరామయ్య, శాఖమూరు వెంకటకుమారి, షేక్ లాల్‌సా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు

నందిగామ టౌన్: మాజీముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం తొమ్మిది గంటలకు నందిగామ గాంధీ సెంటరులోని మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. మాజీఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావుతో కలిసి జగనన్న జన్మదిన కేక్‌ను కట్ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అదేవిధంగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.

అన్ని గ్రామాల్లో నిర్వహించాలి..

జగ్గయ్యపేట అర్బన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకను అన్ని గ్రామాల్లో నిర్వహించాలని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ వేడుకలు ఘనంగా నిర్వహించాలని కోరారు.

నేడు అన్నదానం..

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని శనివారం జగ్గయ్యపేట పట్టణంలోని తమ నివాసం వద్ద నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, జగనన్న అభిమానులు, నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి రాజగోపాల్ (చిన్నా) శుక్రవారం తెలిపారు. మధ్యాహ్నం 12గంటకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలంతా హాజరుకావాలని కోరారు.

నేడు పలు సేవా కార్యక్రమాలు..

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ పట్టణ విభాగం ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9.30గంటలకు పార్టీ నియోజకవర్గ కార్యాలయం వద్ద పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్ శుక్రవారం తెలిపారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై తీవ్ర నిరసన

జగ్గయ్యపేట అర్బన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని బహుజన సమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఇటీవల రాజ్యసభలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరును ప్రస్తావిస్తూ అవమానకరంగా మాట్లాడటాన్ని నిరసిస్తూ శుక్రవారం బీఎస్పీ ఆధ్వర్యంలో స్థానిక సత్యనారాయణపురంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి కొదమల ప్రభుదాసు మాట్లాడుతూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అంబేడ్కర్ పేరును అవమానిస్తూ పార్లమెంట్‌లో మాట్లాడటం ద్వారా భారతజాతి మొత్తాన్ని అవమానించారన్నారు. పార్లమెంట్‌లో రాజ్యాంగకర్తను అవమానించడం తగదన్నారు.ఈ విషయాన్ని బీఎస్పీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బహుజన సమాజ్ పార్టీ దీనిని తీవ్రంగా ఖండిస్తుందన్నారు. బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చలకూర పుష్పరాజు మాట్లాడుతూ అంబేడ్కర్‌కు వ్యతిరేకంగా తాను చేసిన వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ కేంద్రహోం శాఖ మంత్రి అమిత్‌షా వెంటనే భారతజాతికి క్షమాపణలు చెప్పాలని, ఆయనను భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు, న్యాయవాది ఆరేపల్లి వెంకటేశ్వర్లు, పోలంపల్లి రాధమ్మ, సైదాబీ, బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు కేవీ.రత్నం, నాయకులు చింతల రమణ, హెప్సిబా తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నాయకులు, బీసీ నాయకులు

అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తాం : ఆర్డీఓ


శౌరిఅమరవరంలో రైతుల సమస్యలు వింటున్న నందిగామ ఆర్డీఓ కె.బాలకృష్ణ


రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న వత్సవాయి తహసీల్దార్ నరసింహారావు

శౌరిఅమరవరం(కంచికచర్ల): గ్రామాల్లో భూవివాదాలకు తావులేకుండా ఆయా భూసమస్యలను పరిష్కరించడమే రెవెన్యూ సదస్సుల ముఖ్య ఉద్దేశమని నందిగామ ఆర్డీఓ కె.బాలకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని శౌరి అమరవరం గ్రామ సచివాలయంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీఓ బాలకృష్ణ మాట్లాడుతూ ఆయా భూసమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు పది అర్జీలు అందజేశారని తెలిపారు. సదస్సుల్లో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని వివరించారు.కార్యక్రమంలో తహసీల్దార్ పి.జాహ్నవి, డిప్యూటీ తహసీల్దార్ మానస, ఆర్ఐ వెంకట్, వీఆర్వో కొండపల్లి బ్రహ్మం, రైతులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో...

లింగగూడెం(పెనుగంచిప్రోలు): రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎ.శాంతిలక్ష్మి సూచించారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆయా భూసమస్యల పరిష్కారం కోరుతూ రైతులు పది అర్జీలు అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఉన్న భూ సమస్యలకు ఈసదస్సుల ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. ప్రతి అర్జీకి రశీదు అందజేయడంతోపాటు ఆయా అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని వివరించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ లివింగ్‌స్టోన్, గ్రూపు ఆలయాల ఈఓ రవీంద్రబాబు, రైతులు పాల్గొన్నారు.

వత్సవాయి మండలంలో..


దబ్బాకుపల్లి(వత్సవాయి): మండలంలోని దబ్బాకుపల్లి గ్రామ సచివాలయ ఆవరణలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆయా భూసమస్యల పరిష్కారం కోరుతూ రైతులు 34 అర్జీలు అందజేశారు.ఈసందర్భంగా తహశీల్దార్ ఎస్.నరసింహారావు మాట్లాడుతూ ఆయా అర్జీలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కొట్టె నగేష్, ఆర్ఐ జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..

నందలూరు(వీరులపాడు): మండలంలోని నందలూరులో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తమ భూసమస్యలు పరిష్కరించాలని కోరుతూ పదిమంది రైతులు అర్జీలు అందజేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ హుస్సేన్ మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారం కోసమే సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీవో అరుంధతీదేవి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నందిగామ మండలంలో..

నందిగామటౌన్: గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సురేష్ బాబు సూచించారు. మండలంలోని లచ్చపాలెంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసర్వే, పట్టాదారు పాస్ పుస్తకాలు, డిజిటల్ సిగ్నేచర్ తదితర సమస్యలు పరిష్కరించాలంటూ పలువురు రైతులు అర్జీలు అందజేసినట్లు వివరించారు. రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పెనుగంచిప్రోలు తహసీల్దార్ శాంతిలక్ష్మి

26న ద్విచక్ర వాహనాలకు వేలం

జి.కొండూరు: ఈ నెల 26వ తేదీ ఉదయం 9గంటలకు పలు ద్విచక్ర వాహనాలకు వేలంపాట నిర్వహిస్తామని ఎస్ఐ సతీష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచినవారు జి.కొండూరు పోలీసుస్టేషన్‌కు రావాలని ఆయన సూచించారు.

వాహనాల తనిఖీ


వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ ఉమామహేశ్వరరావు

వత్సవాయి: మండల కేంద్రం వత్సవాయి సమీపంలోని రాష్ట్ర సరిహద్దు వద్ద ఎస్ఐ పి.ఉమా మహేశ్వరరావు శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాల రికార్డులను పరిశీలించారు. గతంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో వాహనదారులకు విధించిన చలానాల చెల్లింపులను పరిశీలించారు. వాహనదారులంతా హెల్మెట్ ధరించాలని, విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

తపోవన్ విద్యార్థినికి రాష్ట్రస్థాయి అవార్డు



జగ్గయ్యపేట: పట్టణంలోని తపోవన్ విద్యాలయం విద్యార్థినికి రాష్ట్రస్థాయి అవార్డు దక్కింది. శుక్రవారం విజయవాడలో ఏపీ శక్తి సంరక్షణ మిషన్ వారిచే వివాంత హోటల్‌లో రాష్ట్ర స్థాయి లఘుచిత్ర పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని చెరుకూరి సాహితి 'శక్తిని ఎలా సంరక్షించాలి' అనే లఘు చిత్రాన్ని గీసి ప్రథమస్థానాన్ని గెలుచుకుంది. సాహితికి కి స్పెషల్ చీఫ్ సెక్రటరీ కెవిఎల చక్రధర్ ప్రశంసాపత్రం అవార్డు అందజేసి అభినందించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ సుధీర్ తెలిపారు.

క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలి



నందిగామటౌన్: క్రీడాపోటీల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని ప్రభుత్వ విప్, నందిగామఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న 27వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ వేడుకలను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ముందుగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి క్రీడాజ్యోతిని వెలిగించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత భవిష్యత్ డీప్ టెక్నాలజీ, కృత్రిమ మేధ లాంటి నూతన సాంకేతిక పరిజ్ఞానాలపై ఆధారపడి ఉందన్నారు. భావితరాల కోసం సీఎం చంద్రబాబు యోధుడిలా పోరాడుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం



కంచికచర్ల: వీరులపాడు మండలం దాచవరంలో ఓవ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. ఈసందర్భంగా ఎక్సైజ్‌శాఖ సీఐ షేక్ అష్రపున్నీసాబేగం మాట్లాడుతూ అక్రమంగా మద్యం అమ్మినా లేదా తరలించినా కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ గాలిబ్‌సాహెబ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు


కేక్ కటింగ్‌లో పాల్గొన్న డీనరీ చైర్మన్, కమిటీ సభ్యులు

జగ్గయ్యపేటఅర్బన్: తమ వలే తమ తోటి వారిని ప్రేమిస్తూ జీవించాలని ఆచరించి చూపిన ఏసుక్రీస్తు మాదిరి జీవితాన్ని ప్రతిఒక్కరు కలిగి ఉండాలని సీఎస్ఐ టౌన్ చర్చి డీనరీ చైర్మన్ రెవ సిలారపు పాల్‌రాజు సూచించారు. స్థానిక పోస్టాఫీస్ వద్ద ఉన్న సీఎస్ఐ సెయింట్ థామస్ టౌన్‌చర్చిలో శుక్రవారం సాయంత్రం సెమీక్రిస్మస్, చర్చి ప్రతిష్ట మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కృష్ణా, గోదావరి డయోసిస్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లు పాకలపాటి కనకరాజు, ఎంపీ.జోసఫ్ మాట్లాడుతూ చర్చి అభివృద్ధిని సంఘ సభ్యులకు వివరించారు. సంఘస్తుల క్యాండిల్ సర్వీస్, కేక్ కటింగ్, క్రిస్మస్ నాటికలు, ఇంగ్లిష్ క్వాయిర్ గీతాలు, ప్రదర్శన గీతాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ప్యారిష్ కమిటీ సభ్యులు జీ.సుందరరావు, ఎంవీ.దేవరాజు, కనపర్తి ప్రభాకర్, జంగం కుమార్‌బాబు, రాజకుమారి, రాజరత్నం, కమలకుమారి, స్వరూపరాణి, స్త్రీల మైత్రి ప్రెసిడెంట్ ఆశాపాల్, కార్యదర్శి ఉషాహారిణి, సండే స్కూల్ టీచర్లు ఎలిజబెత్, మణి, యూత్ సభ్యులు,చిన్నారులు, సంఘస్తులు పాల్గొన్నారు.